

# టోపీ జబ్బార్

వేంపల్లె షరీఫ్

మాంచి ఎండాకాలం. ఒక్క పొద్దుల నెల. రెండో శుక్రవారం. జొహర్ నమాజు. మసీదు కిక్కిరిసిపోయింది. అలా నమాజు అయిపోయిందో లేదో..ఇలా గునగునా బయటికి పరిగెత్తి ఒక వారగా వదిలిన చెప్పుల్ని గబగబా తొడుక్కుని అరుగు దిగాడు జబ్బార్.

లేకపోతే పెనాన్ని తలపించే అరుగుమీద అరికాళ్లు అప్పలాలయ్యేవి. కాళ్లు కాలకుండా అందరికన్నా ముందు పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పులు తొడుక్కున్నందుకు అతనికి మనసంతా ఆనందమైంది.

మెల్లగా మసీదు గేటుదాటి బయటికొచ్చాడో లేదో... ఏదో గుర్తొచ్చినోని మాదిరి నెత్తినున్న టోపీ తీసి జేబులో పెట్టుకున్నాడు. ఒకసారి అటూ ఇటూచూసి నేరుగా ఎదురుగా ఉన్న మంగలి బంకులోకి దూరాడు. టోపీ పెట్టుకోవడం వల్ల అణిగిపోయిన జుట్టును పైకి లేపి హీరో శ్రీకాంత్‌లా నుదుటి మీదికి వొచ్చి పడేలా నున్నగా దువ్వుకున్నాడు. తర్వాత మెల్లగా బంకు మెట్లు దిగి ఇంటివైపుకు నడవడం మొదలుపెట్టాడు.

*

అంతకుముందు ఇలాంటి అలవాట్లన్నీ జబ్బార్‌కు లేవు. నెత్తిన టోపీ పెట్టాడంటే నమాజు అయిపోయి ఇంటికొచ్చి తల్లికి 'సలాం' చెప్పేంతవరక్కూడా తీసేవాడు కాదు. ఇప్పుడలా లేదు పరిస్థితి. అమ్ములు పరిచమయ్యాక అతని అలవాట్లన్నీ మారిపోయాయి.

మసీదు నుంచి బయటికొచ్చాక తనను టోపీలో అమ్ములు ఎక్కడ చూస్తుందోనని అతని భయం. అసలే ఆ పిల్ల ఇల్లు అతనింటికెళ్లే దారిలోనే ఉంది. మరి అమ్ములు చూస్తే ఏమవుతుంది? ఏమీ అవదు. మనోడికి చచ్చేంత సిగ్గు. బిడియం. అంతే.

టోపీలో అమ్ములు కంటికి బాగుండడని అతని అనుమానం. ఎప్పుడూ నుదుటిమీదికొచ్చి జుట్టు పడుతుంటే అచ్చం సినిమా హీరోలా ఉంటాడని నమ్మకం. అమ్ములు ముందు బాగా కనిపించాలని ఆత్రం.

అమ్ములు అంటే అతనికి ఇష్టం. అమ్ములుక్కూడా అతనంటే అంతే ఇష్టం. ఇద్దరూ పదవతరగతి చదువుతున్నారు. ఆ పిల్ల వెళ్లేది గర్ల్స్ హైస్కూల్‌కి. జబ్బార్ వెళ్లేది బాయ్స్ హైస్కూల్‌కి. మరి ఎలా కుదిరింది లంకె అంటే వీళ్లు ఇద్దరూ వెళ్లేది సుబ్బూ సార్ ట్యూషన్‌కి. మొదట ఇద్దరిమధ్యా పెద్దగా మాటలు లేవు. ఏదో సబ్జెక్టుకి సంబంధించి అమ్ములుకి ఒకసారి డౌట్ వస్తే ఇతను తీర్చాడు. అప్పటి నుంచి కుదిరింది ఇద్దరికీ దోస్తి.

అమ్ములు పరిచయం కానంతవరకు జబ్బార్ ఫ్రీ బర్డ్. అప్పుడు సుబ్బూ సార్ దగ్గర ఎన్నిసార్లయినా తన్నులు తినొచ్చు. తిట్లు తినొచ్చు. కానీ ఇప్పుడు అతనికి అహం అడ్డమొస్తోంది. గర్ల్‌ఫ్రెండ్ ముందు తన్నులు తినడం ఎంతైనా నామోషి కదా...! అందుకే వీలైనంతవరకు తిట్టించుకునే, కొట్టించుకునే పరిస్థితి రాకుండా జాగ్రత్త పడుతున్నాడు జబ్బార్. కానీ అన్ని టయాలూ మనవే ఉండవు కదా. ఓసారి, హోం వర్క్‌లో తప్పు జరగనే జరిగింది.

"ఓరే సాయిబూగా... ఇట్ట రారా..." అన్నాడు సుబ్బూ సార్.

బెరుకు బెరుగ్గా వెళ్లి నిలబడ్డాడు జబ్బార్.

"నేను జెప్పిన లేక్కేంది? నువ్వు చేసిండేదేం దిరా..." గట్టిగా తొడను గిల్లి పట్టుకున్నాడు సుబ్బూ సారు. పట్టకరతో పట్టి లాగినట్టుంది. విలవిల్లాడాడు జబ్బార్. నొప్పిని కొనపంటితో అణచిపెట్టుకున్నాడు.

అప్పుడు సుబ్బూసార్ అన్నాడు కదా మళ్లీ, "బాగా గొడ్డుసీలు తిని కొవ్వు పట్టినావురా.."

అంతకుముందు కూడా సుబ్బుసారు చాలాసార్లు అదేమాట అన్నాడు. కానీ అప్పుడురాని కోపం ఇప్పుడెందుకో పొడుచుకొచ్చింది జబ్బార్‌కి. తాను నిజంగానే గొడ్డుసీలు తింటానని నమ్మి అమ్ములు తనతో మాట్లాకపోతే ఏమిటి పరిస్థితి? అందుకే ఏదైతే అదైందని గట్టిగా, "సార్," అని అరిచాడు.

ఆ అరుపుకి దడుసుకుని లాగిపట్టుకున్న తొడని వదిలేశాడు సుబ్బుసార్.

"సార్... మీరేమైనా అనండి.. కాని గొడ్డుసీలు తింటామని మాతరం అనమాకండి సార్.. మేం గొడ్డుసీలు తినం. అల్లాసాచ్చి. సింతరాంపల్లిలో ఉంటాండ్లా... ఆ బొంతలోల్లు... వోల్లు... తింటారు..."

"బొంతలోల్లు సాయిబూలు కాదేరా... నీయబ్బ..." అన్నాడు సుబ్బుసార్ మళ్లీ తొడ కోసం చేయి చాస్తా.

సార్ చేతికి అందకుండా కాస్త వెనక్కి జరిగి నిలబడి అన్నాడు జబ్బార్.

"వోల్లు సాయిబూలే కానీ మాకన్నా తక్కువ."

"ఈ ఎక్కువ తక్కువలేందిరా మల్లా... కొత్త కత సెప్తాండావు."

"అట్టకాదు సార్... మేము నిజమైన సాయిబులం... సేకులం..."

"మల్ల వాళ్లేందిరా... అబద్ధం సాయిబూలా...?"

"వోల్లు బొంతలోల్లు సార్. ఈత బొంతలు అల్లుకుని బతకతారు. మనుషులు సచ్చిపోయినప్పుడు సుట్టి పడేచ్చారే... ఆ బొంతలు అల్లేది వోల్లే. గొడ్డుసీలు తింటారు. మేం తినం. కాబడ్తే సూడండి... వోల్ల మాటలు గుడక మా మాటల మాదిరి ఉండవు. మా ఇండ్లల్లో వోల్లు తినరు... వోల్ల ఇండ్లల్లో మేము తినం. వోల్ల ఇండ్లల్లో మా వోల్లు పెండ్లిళ్లు గుడక చేసుకోరు. సాయి బూల్లో తక్కువోల్లు సార్ వోల్లు."

"అట్టనా..? సర్లేవోయ్... ఈ పొద్దు నుంచి నిన్ను సాయిబూ అనకుండా.. ఆఫ్‌గా అని పిలుచ్చాలే.. అబ్బుడు ఇద్దరికీ సరిపోతాది..." అన్నాడు సుబ్బూసారు.

ఆ మాటతో ట్యూషన్లో పిల్లోళ్లంతా పకపకా నవ్వారు. వాళ్లు నవ్వాక కానీ జబ్బార్‌కు ఆ మాటకు అర్థమేంటో తెలీలేదు. ఆఫ్‌గా అంటే సాయిబూలకి సున్తీ చేసి అంగంపై కొంత తోలు తీసేస్తారు కదా... ఆ అర్థం వచ్చేటట్టు పిలిచాడు సుబ్బూ సారు.

మళ్లీ సార్‌తో వాదించే ధైర్యం లేక, అవమానంతో మెలికలు తిరుగుతూ వచ్చి కూచున్నాడు జబ్బార్.

రోజులు ఇలా గడుస్తుంటే ఇదిగో ఈ ఒక్కపొద్దుల నెల వచ్చింది. ఈ నెల అమ్ములును, అతన్ని మరింత దగ్గర చేసింది. మామూలు రోజుల్లో అయితే ఎప్పుడో శుక్రవారం రోజు మాత్రమే జబ్బార్‌కి టోపీతో అక్కరయ్యేది. కానీ రంజాన్‌లో మాత్రం ఎంత పాపిష్టోడు అయినా ఐదుపూటల నమాజు చదవాల్సిందే. ఒక్కపొద్దు పెట్టాల్సిందే. మరి ఐదుపూటల నమాజు చదివి ఒక్కపొద్దు పెట్టాలంటే ఇరవై నాలుగ్గంటలూ టోపీ నెత్తిన ఉండాల్సిందే. కానీ నెత్తిన టోపీ ఉంటే అమ్ములు చూస్తుందని జేబులో పెట్టుకుని తిరుగుతున్నాడు జబ్బార్.

అమ్ములుకి జబ్బార్‌ని టోపీలో చూడాలని కోరిక. "ఓబ్బీ... జబ్బారా... నా కోసరమని ఒకపారి నా ముందు టోపీ పెట్టుకుని సూపిచ్చవా?" అని అడుగుతోంది రోజూ.

"లేదబ్బా. ఇది దేవుని టోపీ. యాడపడితే ఆడ పెట్టుకోకూడదు. కండ్లు పోతాయ్..." అని ఏదో సర్దుకు చెప్పుకొస్తున్నాడు జబ్బార్.

నిజానికి టోపీ నెత్తినుంటే చెడు ఆలోచనలు రావంటుంది వాళ్ల అమ్మ. అల్లా భయం పని చేసి, చెడు ఆలోచనల్నుంచి మనిషి తనను తాను రక్షించుకుంటాడని, అందుకే టోపీ ఎప్పుడూ నెత్తినే ఉండాలని అతని తల్లి చెబుతుంది. అయినా దాన్ని దాచేసి అమ్ములుతో ఎప్పటికప్పుడు కట్టుకథలు చెప్పి తప్పించుకుంటున్నాడు.

కానీ అమ్ములులో మాత్రం అతన్ని టోపీలో చూడాలనే కోరిక రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.

*

ఆలోచనల్లోనే మసీదునుంచి ఇంటికొచ్చాడు జబ్బార్. శుక్రవారం పేరుతో మధ్యాహ్నం స్కూలు ఎగ్గొట్టి సాయంత్రం మసీదుకెళ్లి ఒక్కపొద్దు విడిచి అట్నుంచటే ట్యూషన్‌కి వెళ్లాడు. అక్కడికి వెళ్లేసరికి అతని కోసం అమ్ములు వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. కూర్చున్న చోటు నుంచి కొంచెం జరిగి అతన్ని పక్కనే కూర్చోపెట్టుకునింది. ఉదయం నుంచి సాయంత్రం దాక ఏమీ తినకుండా, నీళ్లు కూడా తాగకుండా, కనీసం ఎంగిలి కూడా మింగకుండా ఒక్కపొద్దు ఉండి వచ్చిన జబ్బార్ మీద ఆమెకు జాలి కలిగింది. ట్యూషన్‌కి

వచ్చేటప్పుడు ఇంట్లో ఫ్రిజ్‌లో ఉంచిన బెడ్డు ముక్కలు రెండు సంచిలో వేసుకుని తెచ్చింది. అది గుర్తొచ్చి వాటిని తీసి జబ్బార్‌కి ఇచ్చింది. అతను తిన్నాడు.

''సుబ్బుసార్ ఈ పొద్దు ఊళ్లో లేడంట. వొచ్చేసరికి లేటయితాదని ఆయమ్మతో సెప్పినాడంట. మనల్నందర్నీ బుద్ధిగా సదువుకోమన్నాడంట సారు...'' అన్నది అమ్ములు.

''అట్టనే గానీలే...'' అని పుస్తకం తెరిచాడు జబ్బార్. అలా కొద్దిసేపు గడిపాడో లేదో... ఇంటర్వెల్ వదిలారు. పుస్తకాలను కిందనే పెట్టేసి పాన్ పోసుకుందామని బయటికి పోబోయాడు జబ్బార్. అంతలో ఉన్నట్టుండి జబ్బార్ పైజేబులోంచి చటుక్కున టోపీ లాక్కుని బయటికి పరిగెత్తింది అమ్ములు.

అది పూలపూల టోపీ. సన్నటి దారాలతో నేసిన తెలతెల్లని టోపీ. మొన్నటి ఉర్సులో అరచి గీపెట్టి వాళ్ల నాన్నతో కొనించుకున్న ఇష్టమైన టోపీ. ఆ టోపీని అమ్ములు లాక్కునేసరికి అతనికి బాగా కోపం వచ్చింది. కాని అతని కోపాన్ని పట్టించుకునే స్థితిలో లేదు అమ్ములు. టోపీ దొరికిన ఆనందంలో దాన్ని నెత్తికి పెట్టుకుని కాసేపు ''వ్వె..వ్వె..వ్వె..'' అంటూ వెక్కిరిస్తూ కులికింది.

కులికిందే కాక, మళ్లీ ''బావుండానా?'' అని జబ్బార్‌నే అభిప్రాయం అడిగింది. జబ్బార్‌కు మండింది. తలకు రెండు జడల మధ్యలో టోపీ పెట్టుకుని వెక్కిరిస్తున్న ఆ పిల్ల అచ్చం కొమ్ములు మొలిచిన దెయ్యంలాగా అనిపించింది. వెంటనే ఆమెను వారించడానికి ముందుకు వెళ్లాడు. అమ్ములు మరింత దూరం పరిగెత్తింది.

''అమ్ములూ... సెప్తాండా యినుకో... టోపీ ఇచ్చేయ్... నువు యాదాంతో అయినా ఆడుకోగానీ టోపీతో మాతరం ఆడుకోగాకు. నాకు పిచ్చి కోప మొచ్చాది...'' అని వెంటపడుతున్నాడు జబ్బార్.

''నువ్వు టోపీ పెట్టుకోని సూపిస్తానంటే ఇస్తా... లేకుంటే ఇయ్యా...'' అన్నది అమ్ములు.

''మల్లా అదే సెప్తావే. సెప్పినాకదా... దేవుని టోపీ యాడంటే ఆడ పెట్టుకోగూడదని...''

అమ్ములు వినకుండా పరిగెడుతూనే ఉంది. ఎక్కడున్నాడో మరో క్లాస్‌మేట్ పక్కీరగాడు ఆవైపు నుంచి వస్తూ అమ్ములు దగ్గర్నుంచి చటుక్కున టోపీ లాక్కున్నాడు.

'వాడసలే ఎక్కిరోడు. వాడి సేతిలో టోపీ పడితే ఇంగ్యాడిది సామి? అది సక్కంగా మల్లా నా సేతికి రావడానికేనా?' అని తల్చుకుని మరింత కుంగిపో యాడు జబ్బార్. అమ్ములును వదిలేసి పక్కీర వెంట పడ్డాడు.

అనుకున్నట్లే వాడు కూడా టోపీ నెత్తిన పెట్టు కుని, ''అల్లా ఉక్బర్ అల్లా... అల్లా ఉక్బర్ అల్లా...'' అంటూ  వెక్కిరిస్తూ వెరైటీగా డాన్స్ చేశాడు.

ఇటు అమ్ములుకి కూడా మండిపోయింది. ''పక్కీరా... టోపీ ఇచ్చేయ్... నువ్వు నా తాన్నుంచి తీసు కున్నావు గదా... అది నాకే ఇయ్యి మల్లా.  నేనే జబ్బార్ కియ్యడం నాకు మర్యాద. లేకపోతే ఈ పొద్దు నాసేతిలో సచ్చిపోతావ్ సూస్కో.. .'' అంటూ పక్కీర వెంటపడింది.

కొంతదూరం పరిగెత్తాక పక్కీరగాడు ఏమను కున్నాడో ఏమో ఉన్నట్టుండి ఆగి వెనక్కి తిరిగి టోపీని అమ్ములు వైపుకు గాల్లోకి విసిరేశాడు. అది గాల్లో కాసేపు చక్కర్లు కొట్టి అలా వెళ్లి... ఇలా వెళ్లి... చివరికి ముళ్లకంపల దగ్గర పడింది. అది చూడగానే జబ్బార్‌కి కడుపు కాలిపోయింది.

టోపీ దగ్గరికి పరిగెత్తాడు. అప్పటికే అమ్ములు దాన్ని తీసుకుని మట్టిని విదిలిస్తోంది. ఎర్రగా మారిన జబ్బార్ మొహాన్ని చూడగానే అమ్ములు బిక్కచచ్చిపో యింది.

దీనంతటికి కారణం తానే అనే విషయాన్ని ఒప్పు కుంటున్నట్టు మొహం పెట్టి, ''సారీ... సారీ...'' అంటూ గడ్డం పట్టుకుంది.

''సారీ లేదు... గీరీ లేదు... ఇంగెప్పుడూ నాతో మాట్లాడగాకు...'' అంటూ టోపీ లాక్కుని అక్కడ్నుంచి విసవిస వచ్చేశాడు జబ్బార్.

*

ఆ పొద్దుట్నుంచి అమ్ములుకి- జబ్బార్‌కి మాటలు లేవు. ట్యూషన్లో ముభావంగా ఉంటున్నాడు జబ్బార్. ఎవరైనా ఉండి పలకరిస్తేనే పలుకుతున్నాడు. అమ్ములుకి దూరంగా కూర్చుంటున్నాడు. మరీ జబ్బార్ అంత కాకపోయినా అమ్ములు కూడా కొంత ముభావం గానే ఉంటోంది. జబ్బార్‌ని పలకరించాలంటే ఆమెకు ధైర్యం చాలడం లేదు. అప్పుడప్పుడు పుస్తకంలో నుంచి తలెత్తి, 'ఏం జేస్తాండాడో...?' అని మాత్రం చూస్తోంది. జబ్బార్ కూడా ఆమెవైపు చూస్తున్నాడు కానీ మాట్లా డ్డానికి ఇష్టపడటం లేదు. అలా మూడురోజులు గడిచి పోయాయి. నాలుగో రోజు అమ్ములు ట్యూషన్‌కి రాలేదు. ఆ ఒక్కరోజుకే జబ్బార్‌కి బెంగపట్టుకుంది.

'ఏమయ్యుండాదోనే...?' అనుకున్నాడు.

అమ్ములు స్నేహితురాలు తులసిని అడిగితే? తులసికి రెండు కాళ్లూ లేవు. పోలియో. చక్రాల బండిలో ట్యూషన్‌కి వస్తుంది. అమ్ములుకి ఆ పిల్లంటే ప్రేమ. ట్యూషన్ వదుల్తూనే పుస్తకాల బ్యాగును తీసుకెళ్లి బండ్లో పెట్టి, ఆ పిల్లను బండి ఎక్కించి, కొంత దూరం బండి తేలిగ్గా కదిలేంతవరకు తోసొచ్చి అప్పుడు తన పుస్తకాలు తీసుకుని ఇంటి దారి పడుతుంది. ఏదైనా ఉంటే తులసికి చెప్పి ఉంటుందని జబ్బార్‌కి నమ్మకం. కానీ అడగాలంటే అతనికి ఏదో ఇబ్బందిగా ఉంది. రేప్పొద్దున అమ్ములు వచ్చినప్పుడు, 'నువ్వు రాని పొద్దు నీ కోసరం జబ్బార్ అడిగినాడుమ్మే...' అంటే అమ్ములు ముందు తనకు చిన్నతనం కదా. అందుకే అడగలేదు.

ఐదోరోజు సాయంత్రం ట్యూషన్లో జబ్బార్‌కి కళ్లు బయర్లు కమ్మాయి. ఒక్క పొద్దులుండి కాదు... అమ్ములుని బోడిగుండులో చూసి.

ఆ పిల్ల వాళ్లమ్మానాన్నతో కలసి తిరుపతికి వెళ్లిందట. ఏదో మొక్కుందని ఇంట్లో వాళ్లంతా గుండు కొట్టించుకున్నారంట. సుబ్బుసార్ అడిగితే లేచి నిలబడి రెండు చేతులు కట్టుకుని మరీ చెప్పింది అమ్ములు.

'ఇదేందిరా సామీ ఇట్ట తయారయ్యిండాదీ పిల్ల...' అనుకున్నాడు మనసులో జబ్బార్. అతనికి అమ్ములు వైపు చూడబుద్ధి కాలేదు.

అమ్ములుది గుండ్రటి ముఖం. గోదుమపిండి రంగు. నుదుట సన్నటి కుంకుమ బొట్టుపెట్టుకునేది. లంగా చోళీ వేసుకుని రెండు జడలు ఊపుకుంటూ వచ్చేది. రెండు కళ్లను చక్రాల్లా తిప్పుతూ చలాకీగా ఉండేది. జబ్బార్‌కి చూసే కొద్దీ చూడాలనిపించేది.

అమ్ములు ఇప్పుడిలా చెప్పాపెట్టకుండా ఉన్నట్టుండి గుండు కొట్టించుకుని వచ్చినందుకు అతనికి కోపమొచ్చింది. 'ఎవుర్ని అడిగి గుండుకొట్టిచ్చుకున్నావ్?' అని నిలదీయాలనిపించింది. కానీ తనకేం హక్కుంది. అయినా కూడా ఆగలేకపోయాడు.

"ఎందుకిట్ట జేసినావ్. ఏం బాగలేదు తెలుసునా... నీకు గుండు. సూడాల్లంటేనే ఎట్టనో ఉండాది," అన్నాడు జబ్బార్ ఇంటర్వెల్లో అమ్ములు దగ్గరికి వెళ్లి.

అమ్ములు పకపకా నవ్వింది. మౌనవ్రతం వీడి మళ్లీ తనతో జబ్బార్ మాట్లాడి నందుకు సంతోషమో లేకపోతే, 'ఏందీ పిల్లోడు ఇట్ట అడిగినాడని,' ఆశ్చర్యమో కానీ కళ్లల్లో నీళ్లు వొచ్చేదాక నవ్వింది.

"గుండు యాడన్నా బావుంటాదా? బావుండే దానికా గుండుకొట్టిచ్చుకునేది. అది దేవుని కార్యం. దేవునికి ఏదిట్టమైతే మనమది సెయ్యాల," అన్నది.

"మొగపిల్లదానివా నువ్వేమన్నా...? ఆడపిల్ల దానివి... గుండు కొట్టిచ్చుకుంటే ఏం బావుంటాది? అందుకే సెప్పినాను. దానికి నువ్వు నవ్వుతానంటే నవ్వుకో. నేనెందుకు అడక్కండా ఉండాల?" ఉడుక్కున్నాడు జబ్బార్.

అంతలో పక్కీరగాడు ఏదో పనిబడినోడిలాగ వాళ్ల పక్కకొచ్చి నిలబడుకున్నాడు. సిఐడి ఆఫీసర్‌లాగ ఫోజుపెట్టి వాళ్లవైపు చూసి... "బోడెక్క... బోడెద్దుల జోడెక్క..." అనుకుంటూ వెళ్లాడు.

జబ్బార్‌కి మండింది. అమ్ములు మాత్రం తొణక లేదు... బెణకలేదు. వినీ విననట్టే ఉంది. అది జబ్బార్‌కి ఆశ్చర్యం కలిగించింది.

"ఏంది అమ్ములు... నువ్వట్ట వొదిలేసినావు వోణ్ని. వోడు నిన్ను బోడెక్క అంటాండాడు తెలుసునా. ఎగిచ్చి తన్నుండాల్సింది..." అన్నాడు.

"ఎందుకు తన్నేది. వాని బోడి వాని దగ్గర్నే వుంటాది. మన బోడి మన దగ్గర్నే ఉంటాది. వోడు నిజంగా మగోడయ్యింటే నాముందు కొచ్చి నిలబడుకుని కదా అనాల్సిండేది. వాడట్ట అనుకుంటాపోతే మనదేంపాయ..." అన్నది అమ్ములు.

"ఇయన్నీ ఎందుకనే గదా... నేను సెప్పిండేది? గుండు ఎందుకు కొట్టిచ్చుకున్నావని..."

"వోర్ని ఇది బావుండాదే. వోడు ఏదో అంటాడని నేను దేవుని కార్యానికి దూరంగా ఉండాల్నా?" అనింది అమ్ములు.

ఆ మాటతో జబ్బార్‌కి కనువిప్పు అయ్యింది. కాసేపు ఏం మాట్లాడకుండా ఉండిపోయాడు. తర్వాత అమ్ములూనే అన్నది.

"ఇయ్యన్నీ ఎట్టన్నా ఉండనీగానీ నాకొకటి సెప్పు... నువ్వు టోపీ పెట్టుకుని కానచ్చావా... కాన్రావా...?"

ఎందుకోగానీ ఈసారి ఆ మాటకు జబ్బార్ తప్పించుకోలేదు. ముసిముసిగా నవ్వాడు. ఆ నవ్వే అతని అంగీకారాన్ని తెలుపుతోంది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 19 ఆగస్ట్ 2012*

